క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మున్సిపాలిటీ 9వ వార్డుకు చెందిన గొల్ల శ్రీనివాసులుకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.8 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి



గట్టు: కార్యకర్తలంతా కలసి కట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమంతునాయుడు అన్నారు. గురువారం రాత్రి ఇందువాసి గ్రామంలో హనుమంతునాయుడు పర్యటించారు. బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రాఘవేంద్రరెడ్డి, మోనేష్, వెంకటేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పారాయణ మహాయజ్ఞం



ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భాగవత పారాయణ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు వికాస తరంగిణి, విశ్వ హిందూ పరిషత్, ధర్మప్రసార సమితి సంఘాల కమిటీ సభ్యులు మద్భగవద్గీత సప్తాహ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సంఘాల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి



ఎర్రవల్లి: జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని తెలంగాణ జవహర్ బాల్‌మంచ్ జిల్లా అధ్యక్షుడు సంధ్యాబాబు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారయణకు వినతి పత్రం అందజేశారు. ప్రతి పాఠశాలలో ఖచ్చితంగా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసి డ్రగ్స్ నిర్మూలనకు జిల్లా విద్యాశాఖ అధికారులు ముందుండి భావి తరాలను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, రాజేష్, మోహన్, నరసింహ పాల్గొన్నారు.

సమస్యల పుట్టగా కేజీబీవీ



ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల గ్రామంలోని కేజీబీవీలో సమస్యలు తాండవిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఓబీసీ ప్రోగ్రామింగ్ కో కన్వీనర్ జంగం నాగమల్లయ్య అన్నారు. శుక్రవారం కేజీబీవీని సందర్శించిన ఆయన నెలకొన్న సమస్యలపై ప్రశ్నించారు. తాగునీరు, రక్షణ గోడ, సరైన రహదారి, బాత్రూంలు సరిపడినన్ని లేవన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగస్వామి, జగదీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలాలి గంధోత్సవం

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలోని మసీదులో ప్రతిష్ఠించిన కొడిపీర్ల ఉత్సవాలు వైభవంగ సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి మౌలాలి గంధోత్సవాన్ని గౌస్ సాహెబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి రాత్రి 1 గంటలకు పట్టణంలోని పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. శనివారం సాయంత్రం హుస్సేనే ఆలం, ఇమామేఖాసిం, ఇమామే జలాలీ పీర్లను భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- ఇళ్ల ఎదుట నిలుస్తున్న మురుగు
- సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ఎల్కూర్‌లో బీసీ కాలనీలో రోడుపై నిలిచిన మురుగు

మల్దకల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ లేక మురుగు, వర్షపు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గ్రామాలు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి.

మండల పరిధిలో

అమరవాయి, ఎల్కూర్, నాగర్‌దొడ్డి, మల్దకల్, బిజ్వారం, విఠలాపురం, దాసర్‌పల్లి, ఉలిగేపల్లి, మద్దెలబండ గ్రామాల్లోని పలు కాలనీల్లో మురుగు ఇళ్ల మధ్యనే నిలిచి దుర్గంధం వెదజల్లుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మురుగు నిల్వ కారణంగా దోమలు, ఈగల బెడద తీవ్రమైందని ఆరోపిస్తున్నారు. అదే విధంగా అడివిరావల్ చెర్వు, తాటికుంట, పెద్దొడ్డి, చిప్పదొడ్డి, పాల్వాయి గ్రామాల్లోని వివిధ కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది.

వ్యాధులు ప్రబలే అవకాశం

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, పారిశుద్ధ్య చర్యలు అస్తవ్యస్తంగా ఉండటంతో రోగాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో కనీసం చెత్త, మురుగు కూడా తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతున్న సందర్భంలో రోడ్లపై వర్షపు నీరు, మురుగు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అదే విధంగా పంచాయతీ సిబ్బంది కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



అమరవాయి ఎస్సీ కాలనీలో సీసీరోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పట్టించుకోవడం లేదు



గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. సీసీరోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్లపై మురుగు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– తిమ్మన్న, అమరవాయి

దుర్గంధంతో అవస్థలు



గ్రామంలోని వివిధ కాలనీల్లో రోడ్లపై మురుగు నిలిచి దుర్వాసన వస్తుంది. దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. చెత్త సమస్య కూడా వేధిస్తుంది. రోడ్లపై మురుగు, వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.

– రామాంజనేయులు, మల్దకల్

పరిష్కారానికి చర్యలు



మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మల్దకల్

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

ధరూరు: ఉపాధ్యాయులకు పీఆర్సీతో పాటు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీయూపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మన్నాపురం, ఉప్పేరు, ధరూరు, జాంపల్లి, రేవులపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర నాయకులు నరేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 317 బాధితులకు అండగా ఉంటామన్నారు. డీఏల విడుదలలో జాప్యం ఎందుకు చేస్తున్నారో ప్రభుత్వం చెప్పాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న తపస్‌ను ఉపాధ్యాయులు ఆదరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, చక్రవర్తి, నరేష్, రవి, సుంకన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పేరు ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి తదితరులు

కోత దశ.. కరుణించండి సారూ

ధరూరు: బంగారం లాంటి తమ భూములను నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి అతి తక్కువ ధరకు ఇచ్చిన మాకు అడుగడుగునా అన్యాయమే చేస్తున్నారని జాంపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు.. గ్రామ శివారులో 104 ప్యాకేజీలోని డీ–3 మైనర్ కాల్వలో జాంపల్లి గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. అయితే మైనర్ కాల్వకు ఆనుకొని ఉన్న రైతు సుధాకర్ 5 ఎకరాల్లో 15 ఏళ్లుగా బత్తాయి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న స్థలంలో ఉన్న తోటను తొలగించాలని సదరు రైతుపై నెట్టెంపాడు అధికారులు ఒత్తిడి తీసుకొచ్చారు. పంట కోత దశలో ఉందని తనకు కొంత సమయం ఇవ్వాలని కోరినా జేఈ జీసీబీతో దాదాపు అర ఎకరాలో ఉన్న 40 చెట్లను తొలగించారని సదరు రైతు వాపోయారు. మరి కొంత సమయమిస్తే పంట చేతికొచ్చేదని ఈఈ ఆదేశానుసారం లెటర్ రాసి ఇచ్చినా కనికరం లేకుండా పంట మీద ఉన్న చెట్లను తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేశారు.



జాంపల్లి శివారులో బత్తాయి తోటను తొలగిస్తున్న దృశ్యం

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచుల

ఎర్రవల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 6 మంది మాజీ సర్పంచ్‌లను శుక్రవారం సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచులు అడ్డుకుంటారనే నెపంతో కోదండాపురం ఎస్‌ఐ మురళి సిబ్బందితో కలిసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు మాజీ సర్పంచ్‌లు పేర్కొన్నారు.



షేకుపల్లి

అరెస్ట్ సబబు కాదు

ఉండవెల్లి: ముందస్తు అరెస్టు చేయడం సమంజసం కాదని మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. సీఎం సభకు వెళ్తుండగా మాజీ సర్పంచ్‌లను ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లోకేశ్వర్‌రెడ్డి, శేషన్‌గౌడ్, ఈదన్న, తదితరులు పాల్గొన్నారు.

జూరాల వద్ద సందర్శకుల సందడి



క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న కృష్ణమ్మను తిలకిస్తున్న పర్యాటకులు

ధరూరు: ఎగువన కురిసిన భారీ వర్షాలతో జూరాల ఆనకట్టకు భారీగా వరద ప్రారంభమైంది. శుక్రవారం వరద రావడంతో ఆనకట్ట 18 గేట్లను తెరిచారు. గేట్లను ఎత్తడంతో సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కర్ణాటక, మహబూబ్‌నగర్, వనపర్తి, కొత్తకోట తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున సందర్శకులు తరలివచ్చారు. కృష్ణమ్మ పొంగులను సెల్ఫీలతో బంధించారు.



సెల్ఫీ తీసుకొంటున్న సందర్శకులు

డీఈఈపై చర్య తీసుకోవాలి



ఎర్రవల్లి: అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్న డీఈఈపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం మండలంలోని షేకుపల్లికి చెందిన రైతులు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జూరాల కుడి కాల్వ డీ– 34 పరిధిలో 3ఎల్ మైనర్ ఆయకట్టు కింద పలువురు రైతులు వ్యవసాయం చేస్తున్నారని, కాల్వ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ అధికారులు పాతిన రాళ్లను తొలగించారని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని వాపోయారు. సదరు అధికారిపై చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వెంకటేష్‌రెడ్డి, శేఖర్, మల్లేష్, మల్లన్న, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం



అయిజ: పట్టణంలో పారిశుద్ధ్యం లోపించి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ నాయకులు మున్సిపాలిటీలోని 17వ వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన అభివృద్ధి పనులు జరుగడం లేదని ఆరోపించారు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు రోడ్లపై పారుతుందన్నారు. ఖాళీ ప్రదేశాల్లో ముళ్లపొదలు దట్టంగా వ్యాపించాయని, ఫాగింగ్ చేయకపోవడం వలన దోమలు వృద్ధి చెంది ప్రజలు ఆస్పత్రులు పాలవుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వీరేష్‌గౌడ్, నాగరాజు, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడు వాగు నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమార్కులు ఇసుక తరలిస్తున్నట్లు రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఇసుక సమస్య తీవ్రంగా ఉండటంతో కొందరు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక అధికారుల అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేద్దాం

అలంపూర్: కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేద్దామని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజు కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాట్లాడుతూ.. ఈ నెల 22, 23, 24 తేదీల్లో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శిక్షణ తరగుతులు జరగనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. కులం, వర్గం భారత సమాజ పునఃనిర్మాణ క్రమం, మతోన్మాదం, ప్రతిఘటన పద్ధతులు, రాజకీయ అర్థశాస్త్రం వంటి అంశాలపై బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, ఎండీ అబ్బాస్, బండారు రవికుమార్ వంటి ప్రముఖులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, వెంకటస్వామి, మధు, నాగరాజు, జయన్న తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

ధరూరు: ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ సంగీతలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ధరూరు, కేటీదొడ్డి మండలాల ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువుల విక్రయాలు ఈపీఓఎస్ మిషన్ ద్వారానే జరపాలన్నారు. ముఖ్యంగా ఎరువుల కొరత లేకుండా చూడాలని డీలర్లను ఆదేశించారు. రైతులకు ప్రతి కొనుగోలుకు సంబంధించి బిల్లు ఇవ్వాలని, స్టాక్ వివరాలు బోర్డులపై పొందుపర్చాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీలత, రాజవర్ధన్‌రెడ్డి, సాజిద్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ సంగీతలక్ష్మి

పైపాడు సమస్యలపై దృష్టి పెట్టండి

రాజోళి: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్‌తో కలిసి మున్సిపాలిటీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌కు వినతిపత్రం అందచేశారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. దోమలు, పందుల బెడద ఎక్కువై ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శివ, రాజు, పరుశ తదిదరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం విద్యుత్ వైర్లు తగిలి ఆంజనేయులు, మల్లయ్యకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గొర్రెలు మృత్యువాత పడ్డాయని ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని బాధితులు కోరారు.

బుడ్డారెడ్డిపల్లిలో..

ఇటిక్యాల: మండల పరిధిలోని బుడ్డారెడ్డిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్ తగిలి గొర్రె మృతి చెందింది. మల్దకల్ మండలం కుర్వపల్లి గ్రామానికి చెందిన గొర్ల కాపరి జీవాలను బుడ్డారెడ్డిపల్లి గ్రామం మీదుగా మేతకు తరలిస్తుండగా గ్రామ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి గొర్రె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై విద్యుత్ ఏఈ శేఖర్‌ను సాక్షి వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ సమస్య ఉందని ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. సమస్యను గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఎక్లాస్‌పురలో మృతిచెందిన గొర్రెలు

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



మానవపాడులో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

అలంపూర్/ఎర్రవల్లి/అయిజ/ఉండవెల్లి/ఇటిక్యాల/మానవపాడు: ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాము మాట్లాడుతూ.. అనతి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీందర్‌రెడ్డి, పులేందర్, నరసింహనాయుడు, నరేంద్ర, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

* స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయిల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేసి సత్తా చాటుదామని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ సతీష్‌రెడ్డి, జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజ్ మహ్మద్ అన్నారు. మానవపాడు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో నూతన రేషన్‌కార్డు ఒక్కటి కూడా మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మండలంలో 1,487 రేషన్‌కార్డులు, 296 ఇళ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్‌నాయుడు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

* ప్రజాపాలన ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమనాద్రి, నర్సింహ, రుక్మందర్‌రెడ్డి, వెంకటేష్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

* అయిజ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, మండల అధ్యక్షుడు జయన్న, పట్టణ అధ్యక్షుడు మధు కుమార్, శ్రీధర్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో దేవరాజు, రాణెమ్మ, మైనర్ బాబు, సులోచనమ్మ పాల్గొన్నారు.

* ఉండవెల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తాలో మార్కెట్ యార్డులో కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వెంకట్‌గౌడ్, నాగేష్, రమేష్, నయీం తదితరులు పాల్గొన్నారు.

* అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రుక్మందర్‌రెడ్డి అన్నారు. ఇటిక్యాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందన్నారు. అనంతరం సాతర్ల గ్రామానికి చెందిన గోవర్ధన్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయిజ సన్నాహక సమావేశంలో ..



అలంపూర్‌లో మాట్లాడుతున్న నాయకులు